క్లుప్తంగా

ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై అవగాహన



మోపిదేవి: ఈవీఎం, వీవీ ప్యాట్స్‌తో పాటు ఓటింగ్‌పై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం మోపిదేవి, రావివారిపాలెం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం ఈవీఎం, వీవీ ప్యాట్స్ వినియోగాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లతో నమూనా పోలింగ్ నిర్వహించారు. ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, నందిగం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్దనరావు, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీఆర్వోలు మూర్తి, శ్రీనివాసరావు, దుర్గ గణేష్, ఓటర్లు పాల్గొన్నారు.

ఎదురుమొండిలో నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

నాగాయలంక: అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు గురువారం నాగాయలంకలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. మండలంలోని ఎదురుమొండి(దీవి) సచివాలయం పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందని, నియోజకవర్గంలోని 77 సచివాలయాల్లో ఇదే చిట్టచివరిది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

నేడు, రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

మచిలీపట్నంటౌన్: స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో గురు, శుక్రవారాల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆ సంస్థకు చెందిన ఉద్యోగులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులతో పాటు మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో ఐటీఐ అర్హత కలిగిన నిరుద్యోగులు, పదో తరగతి ఉత్తీర్ణులై పాలిటెక్నిక్ చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకురావాలని చెప్పారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.17 వేల వరకు జీతం చెల్లిస్తారన్నారు.

మోపిదేవి బస్టాండ్‌లో నీటి వసతి కల్పించాలి



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి బస్టాండ్‌లో మరుగుదొడ్డిలో నీటి వసతి లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు పంపు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తింది. మండల కేంద్రంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉండటంతో అధిక సంఖ్యలో భక్తులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా బేతేలు వ్యవస్థాపక దినోత్సవం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రైలుపేటలోని బేతేలు మినిస్ట్రీస్ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతీ, యువకులు పలు క్రైస్తవ గీతాలకు నృత్యాలు చేశారు. ఈ వేడుకలను బేతేలు మినిస్ట్రీస్‌కు చెందిన క్రైస్తవులు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కార్యక్రమానికి బేతేలు మినిస్ట్రీస్ పాస్టర్ రెవరెండ్ నేరెళ్ల వాల్టర్స్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాడెల్లి వసంతరావు, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బూరగ రామారావు, బందెల థామస్‌నోబుల్ పాల్గొని ప్రసంగించారు. నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- హోరాహోరీగా వాలీబాల్, ఖో ఖో పోటీలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రీడాకారులు



నోబుల్ కళాశాల మైదానంలో వాలీబాల్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు



ఏటిమొగ హైస్కూల్ గ్రౌండ్స్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటలకు మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో విశేష స్పందన లభిస్తోంది. మచిలీపట్నం నగరంలోని 21 డివిజన్లలో బుధవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల క్రీడా మైదానాల్లో పోటీలు జరిగాయి. 32 మ్యాచ్‌ల్లో 64 జట్లు పోటీ పడ్డాయి. 384 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో వారి ప్రతిభను కనబరిచారు. పోటీలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు, కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షించారు. ఈ నెల 28వ తేదీ గురువారం నగరంలోని పలు డివిజన్లలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు.

కోడూరులో పోటీలు

కోడూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కోడూరు, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం జెడ్పీ క్రీడా ప్రాంగణాల్లో గ్రామ స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. పురుషులు, మహిళలకు వేరువేరుగా పోటీలు జరిపారు. రెండో రోజైన బుధవారం ఖోఖో క్రీడకు సంబంధించి పోటీలు జరగ్గా, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. క్రీడాకారులకు సచివాలయ సిబ్బంది వసతులు కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

క్రీడాకారుల్లో ఆడుదాం ఆంధ్రా ఉత్సాహం

నాగాయలంక: మండలంలోని నాలుగు జోన్లలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ బుధవారం ఉత్సాహంగా కొనసాగింది. నాగాయలంక, తలగడదీవి, ఏటిమొగ, భావదేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్, తహసీల్దార్ జె.విమలకుమారి మాట్లాడుతూ మండలంలో నాలుగు జోన్లుగా గ్రామస్థాయి క్రీడలు కొనసాగుతున్నాయన్నారు. వాలీబాల్ క్రీడాకారులు 408 మంది పేర్లు నమోదు చేసుకోగా 34 జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. వీటిలో 20 మహిళా క్రీడాజట్లు ఉన్నాయని, నిర్దేశిత షెడ్యూల్ మేరకు ఆటల పోటీలు జరుగుతాయన్నారు. జోన్ల ఇన్‌చార్జిలుగా ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విమలకుమారి, ఎంఈఓ ఏ.రామారావు, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ క్రీడలను పర్యవేక్షించారు. ఆయా జోన్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గూడూరులో ఆటల పోటీలు



మల్లవోలులో వాలీబాల్ పోటీలు

గూడూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా రెండో రోజైన బుధవారం గూడూరు మండలంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సచివాలయం స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మండలంలోని 17 సచివాలయాల్లో పోటీలు హోరాహోరీగా సాగాయి. మండలం మొత్తం 76 జట్లు వాలీబాల్ పోటీలకు నమోదు చేసుకోగా 38 పోటీలు నిర్వహించారు. గురువారం షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు.

తలపడిన 187 జట్లు

పెడన: ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి బుధవారం బహుమతులు అందజేశారు. మండల పరిధిలోని పెనుమల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను చారుమతి రామానాయుడు సౌజన్యంతో అందజేశారు. ఈ సందర్భంగా చారుమతి మాట్లాడుతూ క్రీడాకారుల్లో చైతన్యం కలిగించడానికి బహుమతులను అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారులను గుర్తించి వారిని మరింత తీర్చిదిద్ది రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరళాదేవి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. పెడన నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా వివిధ పోటీల్లో బంటుమిల్లిలో 16 జట్లు, గూడూరు 17, కృత్తివెన్ను 17, పెడన రూరల్ 17, పెడన అర్బన్ 9 జట్లు తలపడ్డాయి. 934 జట్లకు గాను ఇప్పటికీ 187 జట్లు తలపడ్డాయని ఆడుదాం ఆంధ్రా పెడన నియోజవర్గ ప్రత్యేక అధికారి ఫణి దూర్జ్ తెలిపారు.



కోడూరులో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న పెడన మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చారుమతి

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి



కోనేరుసెంటర్: ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాలెం, గోకవరం సచివాలయాల్లో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న కిట్టు తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. కిట్టు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలు అభిమానించే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రిని వదులుకుని దగాకోరు ప్రభుత్వాన్ని, దగాకోరు పాలకులను ఎన్నుకోవటానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. సర్పంచ్ మదిరి అశ్విని, మాజీ సర్పంచ్ దావీదురెడ్డి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, కార్పొరేటర్లు పల్లి శేఖర్, ఐనం తాతారావు, నాయకులు గాజుల భగవాన్, బి.రామారావు పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ ఈశ్వరరావు, కార్యదర్శి డి.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం బెల్ ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వాణిశ్రీ, మేనేజర్ పెద్ది రాజు, వైద్యుడు కె.వి. శివప్రసాద్ పాల్గొంటారన్నారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కండి

బ్యాంకర్లతో కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని, బ్యాంకు అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని రుణాలు ఇస్తూ సమాజంలో పేదరిక నిర్మూలనలో బ్యాంకు అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో డిస్ట్రిక్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య, బ్యాంకు అధికారులతో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అవసరం మేరకు రుణాలు అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. బ్యాంక్ కరస్పాండెంట్లు అవకతవకలకు పాల్పడితే బ్యాంకర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. అక్రమాలు నిరోధించేందుకు గ్రూపు సభ్యుల్లోని బంధువులను కరస్పాండెంట్లుగా నియమించరాదని సూచించారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లోని భూ యజమాని భూమి ఆధారంగా రుణాలు మంజూరు చేసే విధంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు.

696 మందికి రుణాల మంజూరు

ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. రూ.20 లక్షలకు పైబడిన రుణాల మంజూరుకు డీఆర్డీఏ, మెప్మా అధికారుల సంతకాలను బ్యాంకర్లు డ్వాక్రా సంఘాలను అడుగుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ బ్యాంకు అధికారుల వివరణ కోరారు. గ్రూపుల్లోని ఎవరైనా సభ్యులు చనిపోయినా లేదా వలస వెళ్లిన సందర్భంలో మైక్రో క్రెడిట్ ప్లాన్ మీద మాత్రమే వారి సంతకాలు కోరామని బ్యాంకర్లు వివరణ ఇచ్చారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 792 టిడ్కో గృహాలకు గానూ 696 రుణాలు మంజూరయ్యాయని మిగిలిన వారికి కూడా రుణాలు మంజూరు చేసే విధంగా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలన్నారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శంకర్‌జిత్ ఎం.బజానీ, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ జి.చంద్రయ్య పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్ప మండల పూజా మహోత్సవాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం వద్ద ఉన్న బంగారు అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మండల పూజా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. 41 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి హోమం పూర్ణాహుతి కార్యక్రమం గూడూరు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 108 మృణ్మయ కలశాలలో ఆవు నెయ్యి ఉంచి స్వామివారికి మహా నెయ్యాభిషేకం నిర్వహించారు. కంభంపాటి పవన్‌శర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకుడు అరుణ్‌శర్మ అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,500 మంది భక్తులకు 41వ రోజు అన్నసేవ దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన ఊరేగింపులో విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. బాణాసంచా, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు జరిగింది.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి



అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. పెడన మంత్రి కార్యాలయంలో పెడన పట్టణం, పెడన రూరల్, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు బుధవారం మంత్రి జోగి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న మంత్రి జోగి రమేష్ వారి సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎమ్మెల్యే పేర్ని నానికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేస్తున్నారు. ఈ ధర్నా శిబిరానికి బుధవారం మాజీ మంత్రి, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) విచ్చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని, అనారోగ్యం పాలైతే కనీసం సెలవు పెట్టేందుకు కూడా అవకాశం లేకుండా పనిచేస్తున్నామని అటువంటి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు పేర్ని నాని దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మాజీ మంత్రి పేర్ని నాని స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానన్నారు. సీఎం వైఎస్ జగన్‌తో పాటు ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వారి వినతిపత్రాన్ని పేర్ని నాని స్వీకరించారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్‌మతీన్, కోకా ఫణిభూషణ్, నల్లబ్రోలు కుమారి తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత



సత్యనారాయణ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ బడ్డీలసెంటర్‌కు చెందిన బొడుగు సత్యనారాయణ ఇటీవల మరణించారు. అలాగే జొన్నలవారిపాలెం గ్రామానికి చెందిన కూనసాని వీరరాఘవమ్మ ఇటీవల మరణించింది. వీరిరువురు కానూరు సొసైటీలో కొంత మేర రుణం తీసుకుని ఉన్నారు. వారు మరణించటంతో కేడీసీసీ బ్యాంకు సౌజన్యంతో మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కో మృతుని కుటుంబానికి రూ.10 వేల చొప్పున బ్యాంకు మంజూరు చేయగా బాధిత కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు బాధితుల ఇళ్లకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. సొసైటీ తరఫున ఎప్పుడు ఎటువంటి సహాయం కావాలన్నా బ్యాంకును సంప్రదించవచ్చన్నారు. అందుకు సొసైటీ పాలకవర్గం బాధిత కుటుంబాలకు అండగా నిలబడాలని ఆయన సూచించారు. కానూరు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు(బాబు), సొసైటీ కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, గ్రామ కన్వీనర్ బొడుగు రాజేష్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సహాయం

మంగళాపురం(చల్లపల్లి): రైతు కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. మంగళాపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ సభ్య రైతు డొక్కు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. సంఘ సభ్యుల సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య కోటేశ్వరమ్మకు బుధవారం సొసైటీ చైర్మన్ పేరం నాగిరెడ్డి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ కుందుర్తి కమలాకరరావు, పర్సన్లు కొర్రపాటి ముఖర్జి, కాళింగి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా శివ ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం



నగరేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

నాగాయలంక: మహాశివుని జన్మ నక్షత్రంగా భావించే ఆరుద్ర నక్షత్రం పర్వదినం పురస్కరించుకుని బుధవారం మండలంలోని పలు శివాలయాల్లో ఆరుద్రోత్సవం ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. నాగాయలంకలోని ప్రసిద్ధ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఆరుద్ర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఉత్సవమూర్తులతో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి ఉత్సవ శివలింగానికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. దేవతా ఉత్సవ మూర్తులతో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, మునగాల మోహనరావు, తాడికొండ సత్యనారాయణ, పొన్నూరు ప్రసాద్, దేసు సత్యనారాయణ, పంచాయతీ సభ్యుడు చిట్టా అన్నపూర్ణయ్య పాల్గొన్నారు. భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు నేతృత్వంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. చోడవరంలో పురాతనమైన శ్రీబాల త్రిపుర సుందరిదేవి సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు.

శివాలయంలో ఆరుద్ర ఉత్సవాలు

చల్లపల్లి: శ్రీ చక్రస్థిత అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆరుద్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు.

కొనసాగుతున్న పైడమ్మ సంబరాలు



పెడన: పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీ పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో రెండో రోజుకు చేరాయి. బుధవారం ఉదయం అమ్మవారు ఆలయ ప్రవేశం చేయడంతో భక్తులు పెద్ద ఎత్తున శిడిబండ్లను కట్టి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కుబడులను తీర్చుకున్నారు. 11 రోజుల పాటు జరగనున్న పైడమ్మ సంబరాల్లో భాగంగా రెండో రోజు కాపులు వీధికి చెందిన కాపు యువజన సంఘం, కాపు పెద్దలు ఆధ్వర్యంలో 11 శిడిబండ్లు ఏర్పాటు చేశారు. పైడమ్మ గుడి వరకు భారీ జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో మోహన్‌రావు, ఆలయ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు. ఎస్ఐ రవిచంద్రకుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్‌కేఎస్ మరణం పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్ తదితరులు

పెడన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ నల్లమోతు కోట సూర్యప్రకాశరావు మరణం పార్టీకి తీరని లోటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని చెవేంద్ర గ్రామంలో ఎన్‌కేఎస్ ఇంటి వద్ద బుధవారం జరిగిన సంస్మరణ సభకు మంత్రి జోగి రమేష్ హాజరయ్యారు. ప్రకాశరావు చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. బంటుమిల్లి సమితి అధ్యక్షుడిగానే కాకుండా అనేక పదవులకు వన్నె తెచ్చి చాలామంది రాజకీయ నాయకులకు గురువుగా, ఆదర్శంగా నడుచుకున్న వ్యక్తి ప్రకాశరావు అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికిపాటి రామానాయుడు, రాజులపాటి అచ్యుతరావు, గుడిసేవ శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రత్నాకరరావు తదితరులు ఉన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా పేరొందారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ గూడవల్లి నాగరాజు అన్నారు. నగరంలోని 31వ డివిజన్ శారదానగర్ ప్రాంతంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను ఆదుకునేందుకు నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు. ఈ పథకాలతో పేదల కుటుంబాల్లో ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. అలాగే విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదలకు మేలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకు రొయ్యలు కొనుగోలు చేయాలి

అవనిగడ్డ: ఆక్వా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధరకు రొయ్యలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కోరారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్వా కల్చర్ ఖర్చులు పెరిగిపోయినందున రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 100 కౌంటు రొయ్యలు కనీసం రూ.250 వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.